## ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు అనుమతించాలి

- టీటీడీకి బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సూచన



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు పంపుతున్న సిఫార్సు లెటర్లను ఫిబ్రవరి 1 నుంచి అనుమతిస్తామని బోర్డులో తీర్మానం చేసినట్టు గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 294 మంది ఎమ్మెల్యేలు పంపిన సిఫార్సు లేఖలను పరిగణనలోకి తీసుకుని వసతి కల్పించడంతోపాటు, బ్రేక్ దర్శనానికి అనుమతి ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు.

## 'సీతారామ భూసేకరణ'ను పూర్తిచేయాలి

- ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలి
- అధికారులకు నీటి పారుదల మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టుకు భూసేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని సంబంధిత అధికారులను సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి మంత్రి ఉత్తమ్ చర్చించారు. సత్తుపల్లి ట్రంక్, సీతారామ ప్రాజెక్ట్ పురోగతి, భూసేకరణ, ఖర్చు, నాణ్యత, భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులు, పంప్‌హౌస్-4 నిర్మాణాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ పనుల్లో సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని, సీతమ్మసాగర్ బరాజ్ నిర్మాణాన్ని రాబోయే మూడేళ్లలో పూర్తిచేయాలని సూచించారు.

# కస్టడీలో నిందితుడి మృతి!

- పోలీసులు కొట్టడమే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ
- నిజామాబాద్‌లో ప్రభుత్వ జిల్లా దవాఖాన ఎదుట ఆందోళన
- గుండె పోటుతోనే మరణించాడని పోలీస్ కమిషనర్ ప్రకటన
- మృతుడు సంపత్ శరీరంపై బలమైన గాయాలు ఉన్నాయి,
- సిట్టింగ్ జడ్జితో విచారించాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సంపత్‌ను పోలీసులే కొట్టి చంపారని ఆరోపిస్తూ నిజామాబాద్‌లోని జీజీహెచ్ ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు, చిత్రంలో మోహరించిన పోలీసులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ)/వినాయకనగర్: నిజామాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల కస్టడీలో ఓ నిందితుడు గురువారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం వివాదంగా మారింది. పోలీసులు కొట్టడంవల్లే నిందితుడు చనిపోయాడని ఆరోపిస్తూ మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రభుత్వ జిల్లా దవాఖాన ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు చెందిన సంపత్ (32) జగిత్యాల జిల్లాలో మ్యాన్‌పవర్ కన్సల్టెన్సీ ద్వారా నిరుద్యోగులను థాయ్‌లాండ్, మయన్మార్, లావోస్ తదితర దేశాలకు పంపిచాడు. విదేశాలకు వెళ్లిన యువకులు తాము మోసపోయామని తిరిగి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సంపత్‌తో పాటు మరో ఏజెంట్‌పై పదిరోజుల క్రితం కేసు నమోదుచేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించింది. నిందితులను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలు చేయడంతో ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. నిందితులను సైబర్‌క్రైమ్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా గురువారం జగిత్యాలలో సంపత్ కన్సల్టెన్సీ ఆఫీసుకు తీసుకెళ్లారు. లావాదేవీలు, రికార్డులను పరిశీలించారు. రాత్రి నిజామాబాద్ సీసీఎస్‌కు తరలించారు.

### స్టేషన్ లాకప్‌లో ఏమైంది?

గురువారం రాత్రి 10 గంటలకు ఛాతిలో నొప్పిగా ఉన్నదని, చేయి లాగుతున్నదని సంపత్ తెలిపాడని పోలీసులు చెప్తున్నారు. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించగా, సంపత్ చికిత్స పొందుతూ కాసేపటికే మృతి చెందినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు వెల్లడించారు. శుక్రవారం ఉదయం నిజామాబాద్‌కు చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట బైఠాయించారు. పోలీసులు తీవ్రంగా కొట్టడంతోనే సంపత్ మృతి చెందాడని ఆరోపించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అక్కడకు చేరుకుని కుటుంబ సభ్యులతో చర్చించారు. అనుమానముంటే ఫిర్యాదు చేయాలని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

### సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: జాన్‌వెస్లీ

పోలీసు కస్టడీలో నిందితుడు సంపత్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వానికి జాన్‌వెస్లీ లేఖ రాశారు. పోలీసులు చిత్రహింసలు పెట్టడంతోనే అతడు చనిపోయాడని, సంపత్ శరీరంపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని జాన్‌వెస్లీ చెప్పారు.

### అనారోగ్యంతోనే మృతి

పోలీస్ కస్టడీలో సంపత్ అనారోగ్యంతోనే మరణించాడని నిజామాబాద్ సీపీ సాయిచైతన్య ఓ ప్రకటనలో వెల్లడించారు. దవాఖాన లోపలికి సంపత్ నడచుకుంటూ వెళ్లాడని, ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయని తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఘటనపై మానవ హక్కుల కమిషన్‌కు నివేదిక అందించామని వివరించారు.

## ప్రభుత్వ కార్యాలయం నుంచి ఫైళ్ల తరలింపు

**సెలవు రోజు రాత్రి వేళ సీనియర్ అసిస్టెంట్ నిర్వాకం**

ములుగు, మార్చి 14 (నమస్తేతెలంగాణ): ప్రభుత్వ కార్యాలయం నుంచి గుట్టు చప్పుడు కాకుండా రాత్రి సమయంలో ఫైళ్లను తరలించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ములుగు పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయ కాంప్లెక్స్‌లో ఉన్న పే అండ్ అకౌంట్స్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శుక్రవారం రాత్రి తన కారులో వచ్చి అటెండర్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తుల సహాయంతో సుమారు 30కి పైగా ఫైళ్లను ఆఫీసు బయటకు తీసుకొచ్చారు. రోడ్డుపై తెల్లటి క్లాత్‌లో కట్టి కారులో ఎక్కిస్తుండగా అటుగా వెళ్లిన 'నమస్తే తెలంగాణ' ఫైళ్ల తరలింపుపై ప్రశ్నించింది. ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ సార్ ఉన్నారని, ఆయన ఆదేశాల మేరకే కారులో పెడుతున్నట్టు అటెండర్ తెలిపాడు. సదరు అధికారి వద్దకు వెళ్లి వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, మార్చి నెలలో ఆడిటింగ్ ఉన్నందున ఫైళ్లను ములుగులోని తన గదికి తీసుకెళ్తున్నట్టు చెప్పారు. హోలీ పండుగ సెలవు రోజున, అదీ రాత్రి వేళ ఎందుకు ఫైళ్లను తరలిస్తున్నారని అడిగితే దాటవేసే ప్రయత్నం చేశారు. సంబంధిత కార్యాలయ జిల్లా అధికారి సమక్షంలో ఫైళ్లను తరలించాల్సి ఉండగా అటెండర్ సహాయంతో తరలించడం పలు అనుమానాలకు తావిస్తున్నది.



ములుగు పే అండ్ అకౌంట్స్ ఆఫీస్ నుంచి రాత్రి 8 గంటలకు ఫైళ్లను తరలిస్తున్న అటెండర్, మరో ఇద్దరు వ్యక్తులు

## మయన్మార్ సైబర్ రాకెట్‌లో 8 మంది సభ్యుల అరెస్టు

**సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ వెల్లడి**



హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): మయన్మార్ సైబర్ నేరగాళ్ల ముఠాలోని మొత్తం 15 మంది ఏజెంట్లు, మధ్యవర్తుల్లో 8 మందిని అరెస్టు చేసినట్టు సీఎస్‌బీ డీజీ శిఖా గోయెల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిగిలినవారు పరారీలో ఉన్నారని, వారిలో ఐదుగురు విదేశాల్లో ఉన్నారని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా 10 మంది బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ ముఠాపై 9 కేసులు నమోదైనట్టు తెలిపారు.

## చేనేతలకు లక్షలోపే రుణమాఫీ!

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తున్నామని, అందుకోసం రూ.33 కోట్లు విడుదల చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించిన అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభలో పాల్గొన్న ఆయన, ఈ మేరకు ప్రకటన చేసిన విషయం తెలిసిందే. 2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 మధ్యకాలంలో రుణం పొందిన వారికి మాత్రమే మాఫీ జరిగినట్టు జీవోలో పేర్కొన్నారు. దీంతో చేనేత, పవర్‌లూమ్ కార్మికుల్లో కలవరం మొదలైంది. రూ.లక్షలోపు వారికి మాత్రమే రుణమాఫీ చేస్తే, లక్ష దాటిన వారి పరిస్థితి ఏమిటని సర్కారును నిలదీస్తున్నారు. రూ.లక్షకు ఒక్క రూపాయి ఎక్కువైనా రుణమాఫీ చేయడం లేదని చేనేత కార్మిక సంఘాల నాయకులు గగ్గోలు పెడుతున్నారు. బ్యాంకర్లు కూడా ఇదే విషయం చెబుతున్నట్టు పేర్కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 వేల మందికిపైగా చేనేత కార్మికులు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోగా, అధికారంలోకి రాగానే రుణాలు మాఫీ చేస్తామని ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి సుమారు 15 నెలల పాటు ఆలస్యం చేసింది. దీంతో బ్యాంకుల ఒత్తిడికి కొంతమంది చేనేత కార్మికులు తలొగ్గి బయట అప్పులు చేసి రుణాలు తీర్చారు. ఇక మిగిలిన వారికి మాత్రమే ఇప్పుడు రుణమాఫీ వర్తిస్తున్నట్టు చెబుతుండడంతో రుణాలు చెల్లించిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అసలు రుణమాఫీ బ్యాంకుల నుంచి పొందిన అసలుకా? వడ్డీతో కలిపి మొత్తానికి చేస్తారా అనేది తెలియాల్సి ఉందని పేర్కొంటున్నారు. రుణమాఫీకి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇవ్వాలని, అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు చెరుకు స్వామి, పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కూరపాటి రమేశ్ డిమాండ్ చేస్తున్నారు.

## జూలైలో పంచాయతీ ఎన్నికలు జరిగేనా?

- నేటికీ కొలిక్కిరాని బీసీలకు 42 శాతం రిజర్వేషన్
- 2024 ఫిబ్రవరి 1న ముగిసిన పాలకవర్గాల గడువు
- నిబంధనల ప్రకారం ఇప్పటికే 14 నెలలు ఆలస్యం
- సకాలంలో ఎన్నికలు జరుగక నిలిచిన కేంద్ర నిధులు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు జూలైలో అయినా జరుగుతాయా అనే అనుమానం కలుగుతున్నది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించింది. అధికారంలోకి వచ్చి 15 నెలలైనా రిజర్వేషన్ల ప్రక్రియను రేవంత్ సర్కారు కొలిక్కి తీసుకురాలేకపోయింది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన వివిధ అభివృద్ధి నిధులు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ సంక్షేమానికి తీవ్ర విఘాతం కలుగుతున్నది.

### గ్రామాల్లో నిధుల కొరత..

రాష్ట్రంలో గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాలకవర్గాల పదవీకాలం ఇప్పటికే ముగిసింది. నిరుడు ఫిబ్రవరి 1న సర్పంచుల పదవీకాలం ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ఆర్టికల్ 243ఈ(3)ప్రకారం.. ప్రతి ఐదేండ్లకు ఒకసారి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. గ్రామపంచాయతీ పాలకవర్గం గడువు ముగిసేలోపు లేదా పాలకవర్గం రద్దయిన ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తిచేయాలి. కానీ, గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ముగిసి 14 నెలలు కావస్తున్నా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంపై కేంద్ర పంచాయతీరాజ్ వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తాజాగా ఆందోళన వ్యక్తంచేసింది. ఎన్నికల ఆలస్యంతో గ్రామాభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లు నిలిచిపోయాయని తెలిపింది.

### బీసీల రిజర్వేషన్‌పై మల్లగుల్లాలు

కులగణన నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకటించింది. ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల సర్వే నిర్వహించింది. గణాంకాలను అసెంబ్లీలో ప్రకటించింది. 3.1 శాతం(16 లక్షల) జనాభా సర్వేలో పాల్గొనలేదని వెల్లడించింది. సర్వే గణాంకాలపై ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌తోపాటు బీజేపీ, ప్రజాసంఘాలు, కుల సంఘాలు, మేధావులు తీవ్ర అభ్యంతరాలు తెలిపారు. రీ సర్వేకు డిమాండ్ చేశారు. దీంతో సర్కారు ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు మళ్లీ కులగణన వివరాల నమోదుకు అవకాశం కల్పించింది. 15 వేల లోపు కుటుంబాల వివరాలు మాత్రమే సేకరించగలిగింది. ఈ గణాంకాలపై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అప్పుడే 42 శాతం రిజర్వేషన్లపై బిల్లు పెడతామని, పార్లమెంట్‌లో ఆమోదం కోసం పంపిస్తామని చేతులు దులుపుకున్నది.

# పసిడి ధర పైపైకి..

**రూ.90వేల చేరువలో తులం విలువ • హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.89,780**

**రూ.82,300 వద్ద 22 క్యారెట్ రేటు • తొందర్లోనే లక్షకు వెళ్తుందన్న అంచనాలు**



హైదరాబాద్, మార్చి 14: బంగారం ధరలు మళ్లీ పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం రేటు రూ.90,000కు చేరువైంది మరి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల పసిడి విలువ శుక్రవారం మునుపెన్నడూ లేనివిధంగా గరిష్ఠ స్థాయిలో రూ.89,780గా నమోదైంది. గురువారం ముగింపుతో పోల్చితే ఒక్కరోజే రూ.1,200 పుంజుకోవడం గమనార్హం. నాడు రూ.88,580గానే ఉన్నది. ఇక ఆభరణాల తయారీకి వినియోగించే 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) గోల్డ్ రేటు రూ.82,300గా ఉన్నది. అంతకుముందు రూ.81,200గా ఉండగా.. ఒక్కరోజే రూ.1,100 ఎగిసింది.

### ఇదీ సంగతి..

పుత్తడి ధరలు ఒక్క భారతీయ మార్కెట్‌లోనేగాక, అంతర్జాతీయ మార్కెట్‌లోనూ దౌడు తీస్తున్నాయి. తొలిసారి ఔన్సు 3వేల డాలర్లను దాటేసింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రావడంతో.. మార్కెట్‌లో సమీకరణాలన్నీ వేగంగా మారిపోయాయి. ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. గ్లోబల్ ట్రేడ్ వార్‌కు దారితీస్తాయన్న భయాందోళనలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. ఈ క్రమంలోనే స్టాక్ మార్కెట్ల నుంచి వారు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నారు. అలాగే ప్రత్యామ్నాయంగా కనిపించే బంగారం వైపు వాటిని మళ్లిస్తున్నారు. గోల్డ్ రేట్లు ఎగబాకడానికి ఇది కూడా ఓ బలమైన కారణమే. డిమాండ్ క్రమేణా పుంజుకుంటుండటంతో సహజంగానే ధరలు పెరుగుతూ పోతున్నాయని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అంతేగాక ముమ్ముందు ధరలు ఇంకా పెరగవచ్చన్న అంచనాలనూ వెలిబుచ్చుతున్నారు. వచ్చే నెల భారత్‌సహా మరికొన్ని దేశాలపై అధిక సుంకాలు అమల్లోకి వస్తాయని ట్రంప్ చెప్తున్న విషయం తెలిసిందే. ఇదే జరిగితే స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయని, పెట్టుబడులు గోల్డ్ ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లోకి వెళ్లిపోతాయని వారు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా భారతీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఇంకా పెరిగిపోయేందుకు వీలున్నదని అంటున్నారు.

### త్వరలో లక్ష మార్కుకు..

దేశీయ మార్కెట్‌లో ఇప్పుడున్న ట్రెండ్ కొనసాగితే తులం బంగారం ధర లక్ష రూపాయలను దాటిపోవచ్చన్న అంచనాలు ప్రస్తుతం బలంగా వినిపిస్తుండటం విశేషం. దీపావళికి ఈ రికార్డును రేట్లు బ్రేక్ చేస్తాయన్న అభిప్రాయాలు అటు వ్యాపార వర్గాల నుంచి, ఇటు మార్కెట్ నిపుణుల నుంచి వస్తున్నాయి మరి. ఇంకొందరు దీపావళికి కాకపోతే ఈ ఏడాది ఆఖర్లో తప్పకుండా ధరలు రూ.లక్షను దాటేస్తాయన్న విశ్వాసాన్ని కనబరుస్తున్నారు. నిజానికి గత కొన్నేండ్లుగా పసిడి ధరలు పెరగడమే తప్ప, తగ్గిన దాఖలాలు లేవు. గణాంకాలను చూస్తే ఏటేటా అంతకంతకూ పెరుగుతూ పోతున్నట్టే అర్థమవుతుంది. మొత్తానికి సంప్రదాయ కొనుగోలుదారులు, వ్యాపారులతో పాటు మదుపరులూ బంగారంపైనే ఆసక్తి కనబరుస్తుండటంతో అటు భౌతికంగా, ఇటు డిజిటల్‌గా గోల్డ్ రేట్లు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇక ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ఇదే ట్రెండ్ నడుస్తున్నది. చివరకు వెండి ధరలు కూడా ఏమాత్రం తగ్గడం లేదు. కిలో లక్షపైనే పలుకుతున్నాయి. సాధారణ కస్టమర్లతోపాటు పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ కనిపిస్తుండటమే ఇందుకు కారణమని చెప్తున్నారు.

**వాణిజ్య**

## ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ప్రోత్సాహమేది?

- కొత్త స్టేషన్ల ఏర్పాటుకు డిస్కమ్‌ల మోకాలడ్డు
- డబ్బులు చెల్లించినా పరికరాలు ఇవ్వని వైనం
- ఆఫీసుల చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం అంతకంతకూ పెరుగుతున్నా, ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో ప్రోత్సాహం కరువైంది. ముఖ్యంగా విద్యుత్తు సంస్థలే మోకాలడ్డుతున్నాయి. రాష్ట్రంలోని పెట్రోల్ బంకుల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ..విద్యుత్ సంస్థలు మాత్రం సహాయ సహకారాలు అందించడం లేదు. ఈ మేరకు హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీ, చార్జ్‌జోన్, నయారా, అదానీ, జియో వంటి సంస్థలు ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకున్నాయి. హైదరాబాద్ సహా జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాల్లోనూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 300 స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయి. ఈ స్టేషన్ల ఏర్పాటుకు అవసరమయ్యే ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకరణాలు, పరికరాలను డిస్కమ్‌లే సరఫరా చేయాల్సివున్నది. ఈ స్టేషన్ల కోసం 63 కేవీఏ, 100 కేవీఏ, 160 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు, కేబుళ్లు, ఏబీ స్విచ్ బోర్డు వంటి పరికరాలను డిస్కంలు సరఫరా చేయాలి. వాటికి కావాల్సిన నగదును కంపెనీలు చెల్లించాక డిస్కమ్ స్టోర్స్ నుంచి ఆయా సంస్థలకు వాటిని అందజేయాలి. ఇందుకు సంబంధించి 3 నెలల క్రితమే ఒక్కో సంస్థ రూ.3.5 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు నగదును డిస్కమ్‌లకు చెల్లించాయి. నిబంధనల ప్రకారం మూడు రోజుల్లో పరికరాలను అందించాల్సి ఉన్నది. 15 రోజుల్లో బిగించాలి. కానీ మూడు నెలలు దాటినా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను డిస్కమ్‌లు సరఫరా చేయడమే లేదు. దీంతో ఆయా సంస్థల ప్రతినిధులు డిస్కమ్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అయినా కనీస స్పందన కరువైంది. ఈ ప్రభావం అంతిమంగా ఈవీ వాహన వినియోగదారులపై పడుతున్నది. పలుచోట్ల స్టేషన్లు లేక చార్జింగ్ చేసుకోలేక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ఈవీ వాహనదారులు తమ ఇంటిలోనే చార్జింగ్ పెట్టుకుంటున్నారు. ఇది ప్రమాదం అని తెలిసిన సరిపడ చార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో ఇంట్లో విద్యుత్‌తో సరిపెట్టుకుంటున్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ఇదీ పరిస్థితి!

- సంగారెడ్డి జిల్లాలో 15 ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఓ సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.40 లక్షల వరకు డిస్కమ్‌కు చెల్లించింది. అయితే వీటిలో నాలుగు స్టేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను డిస్కం సరఫరా చేయకపోవడంతో 11 కేవీ స్టేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి.
- నల్లగొండ జిల్లాలో 20 స్టేషన్ల ఏర్పాటుకు ఓ సంస్థ 80 లక్షలకు పైగా చెల్లించింది. కానీ ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోవడంతో పురోగతి లేదు.
- హైదరాబాద్ సెంట్రల్‌లో మొత్తం 30 చార్జింగ్ స్టేషన్ల కోసం మరో సంస్థ రూ.1.20 కోట్లు చెల్లించింది. ఇప్పటివరకు కేవలం 10 చార్జింగ్ స్టేషన్లు మాత్రమే పూర్తికాగా, 20 స్టేషన్ల ఏర్పాటు ముందుకు సాగడంలేదు.
- ట్రాన్స్‌ఫార్మర్లు, ఉపకరణాలు సరఫరా చేయకపోవడంతో ఒక్క హైదరాబాద్‌లోనే 100 స్టేషన్ల ఏర్పాటు నిలిచిపోయింది.



## స్టార్ లింక్ సేవలకు భారత్ షరతులు

న్యూఢిల్లీ, మార్చి 14: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థ శాటిలైట్ వ్యవస్థ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు భారత్‌లో రంగం సిద్ధమైంది. ఇప్పటికే మన దేశానికి చెందిన జియో, ఎయిర్‌టెల్‌తో స్టార్‌లింక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. అయితే స్టార్‌లింక్ భారత్‌లో సేవలు ప్రారంభించడానికి కేంద్రం కొన్ని కఠిన షరతులు విధించినట్టు తెలిసింది. సున్నితమైన, సమస్యాత్మకమైన ప్రాంతాలలో శాంతి భద్రతల సమస్యను అదుపు చేసేందుకు కమ్యూనికేషన్ సేవలను నిలిపివేయడానికి, రద్దు చేయడానికి స్టార్‌లింక్ నియంత్రణ కేంద్రాన్ని భారత్‌లోనే ఏర్పాటు చేయాలని భారత్ డిమాండ్ చేసింది. విపత్తు నిర్వహణ, ప్రజా భద్రత కోసం అవసరమైనప్పుడు అధికార మార్గాలు, చట్ట అమలు సంస్థల ద్వారా కాల్ సర్వీసులను యాక్సెస్ చేసి తమ అదుపులోనికి తీసుకునే అధికారం ఉండాలని నిర్దేశించింది. కాగా, అత్యవసర సమయాలలో ముఖ్యంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తినప్పుడు ఆయా నెట్‌వర్క్ కంపెనీల కంట్రోల్ సెంటర్లకు ప్రభుత్వాలు ఆదేశాలు ఇచ్చి వాటిని నిలిపివేయమని ఆదేశిస్తుందని, అయితే కంట్రోల్ సెంటర్‌లు అమెరికా లాంటి దేశాల్లో ఉంటే వాటిపై నియంత్రణ భారత ప్రభుత్వం చేతిలో ఉండదని ఓ కేంద్ర ప్రభుత్వ అధికారి తెలిపారు.

## భారత్‌లో టెస్లా రెండు మాడళ్లే

న్యూఢిల్లీ, మార్చి 14: భారత్‌లో అడుగు పెట్టబోతున్న అంతర్జాతీయ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా.. ఇక్కడి మార్కెట్లో కేవలం రెండు మాడళ్లను మాత్రమే విక్రయించబోతున్నట్లు తెలుస్తున్నది. వీటిలో మాడల్ వై, మాడల్ 3 ఉండనున్నాయని ఇండస్ట్రీ వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. మూడో అతి పెద్ద ఆటోమొబైల్ మార్కెటైన భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించడానికి మస్క్.. ఇక్కడే యూనిట్‌ను నెలకొల్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు, గతేడాది దేశీయంగా లక్ష యూనిట్ల ఈ-కార్లు అమ్ముడయ్యాయి. ప్రస్తుతం టాటామోటర్స్, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటర్స్ పలు మాడళ్లను విక్రయిస్తుండగా..తాజాగా మహీంద్రా, మారుతి, హ్యుందాయ్‌లు సైతం అందుబాటులోకి తెచ్చాయి. భారత్‌లో ఈవీల వినియోగం ఊపందుకుంటున్నదని, 2023లో 6.39 శాతంగా ఉన్న మార్కెట్ వాటా ఆ తర్వాతి ఏడాదిలో 7.46 శాతానికి చేరుకున్నది.




# నయా కార్లతో జోష్

**ఈ నెలలో విడుదలకానున్న నాలుగు మాడళ్లు**

**వీటిలో రెండు ఈవీ, మరో రెండు అప్‌డేటెడ్ కార్లు**

న్యూఢిల్లీ, మార్చి 14: దేశీయ రోడ్లపైకి మరో నాలుగు కొత్త మాడళ్లు దూసుకుపోవడానికి రెడీ అవుతున్నాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలైన మారుతితోపాటు ఎంజీ, వొల్వో, కియాలు తమ కొత్త మాడళ్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నాయి. వీటిలో రెండు ఎలక్ట్రిక్ వాహనాలు కాగా, మరో రెండు ఎస్‌యూవీలు. ఈ మాడళ్లను ఈ నెల చివర్లో మార్కెట్‌కు పరిచయం చేస్తున్నాయి. వాటి వివరాలు..

### మారుతి ఈ-విటారా



దేశవ్యాప్తంగా ఈవీ కార్ల విక్రయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. దీంతో కార్ల తయారీ సంస్థలు వీటిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి. దీంట్లోభాగంగా మారుతి కూడా తన ఈ-విటారాను ఈ నెలలోనే మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. ఢిల్లీలో జరిగిన భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో ప్రదర్శించిన ఈ మాడల్..విడుదలకంటే ముందే షోరూంలలో ప్రదర్శిస్తున్నది కూడా. సింగిల్ చార్జింగ్‌తో 500 కిలోమీటర్లకు పైగా ప్రయాణించనున్న ఈ మాడల్ ధర రూ.18 లక్షల నుంచి రూ.26.5 లక్షల మధ్యలో ఉంటుందని అంచనా.


### ఎంజీ సైబర్‌స్టార్

చైనాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం ఎంజీ..మరో ఈవీ మాడల్‌ను దేశీయ మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నది. రెండు సీట్లు కలిగిన ఎలక్ట్రిక్ స్పోర్ట్ కారు సైబర్‌స్టర్‌ను ఈ నెలలోనే అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 77 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ కారు కూడా 600 కిలోమీటర్లు ప్రయాణించనున్నదని అంచనా. ప్రస్తుతానికి ఈ మాడల్ ధరను విడుదల చేయకపోయినప్పటికీ దీని ధర రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల మధ్యలో నిర్ణయించింది.

### వొల్వో ఎక్స్‌సీ90

ఎడుగురు కూర్చోవడానికి వీలుండే ఎక్స్‌సీ90 మాడల్ కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టబోతున్నది వొల్వో. అంతర్జాతీయ మార్కెట్లో ఇప్పటికే అడుగుపెట్టిన ఈ కారును ఈ నెల చివర్లో అందుబాటులోకి తీసుకురాబోతున్నది. 2.0 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో తీర్చిదిద్దిన ఈ కారులో 8 గేర్లు, 12.3 ఇంచుల టచ్‌స్క్రీన్ వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ కారు ధరను నిర్ణయించలేదు.

### కియా ఈవీ6



కొరియాకు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం కియా నయా ఈవీని విడుదల చేస్తున్నది. ఈవీ6 పేరుతో తీర్చిదిద్దిన 77.4 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 708 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. గంటకు 192 కి.మీ. వేగంతో దూసుకుపోనున్న దీని ధర రూ.60.97-రూ.65.97 లక్షల మధ్యలో నిర్ణయించింది.